# మల్లెల చాటున

హుందాగా ఆగిన డీలక్సులోకి ఠీవిగా ఎక్కాడు నారాయణ ముందుగానే రిజర్వుచేసుకున్న సీటు అతనికోసం ఖాళీగా నిరీక్షిస్తోంది. బస్సు పెద్దరద్దీగా లేదు. రిజర్వు చేసుకోకపోయినా, సీటు దొరికేదే అనుకున్నాడు నారాయణ. ఇద్దరు కూర్చునే సీటులో మొదటిదే అతనిది. అందులో రెండో వ్యక్తి లేరు అందులోనే కాదు చాల సీట్లలో ఒక్కక్కరే కూర్చున్నారు. ఆ కూర్చోవడం కూడ అక్కడొక అక్కడొక సీట్లో కూర్చున్నారు. నారాయణ తన సీట్లో తాపీగా వెనక్కి జారగిలబడ్డాడు. కండక్టరు అందరి దగ్గర టిక్కెట్లుచూసి, తన లెక్కలన్ని చూసుకొని బెల్ కొట్టాడు. అప్పుడు బస్సు మెల్లగా కదిలింది. బస్సు గుమ్మానికి ఒక వైపు అతను మరొకవైపు కండక్టరు కూర్చున్నారు. నారాయణ బస్సుఎక్కిన దగ్గర్నుంచీ ఆ కండక్టరుని గమనిస్తూనేవున్నాడు. అతను గమ్మత్తుగా వున్నాడు. మాటికి మాటికి చూడాలనిపించేటట్టుగా వున్నాడు. నున్నని చెంపలు పలుచగా, ఎర్రగావున్న పెదాలు చురుకైన కళ్ళు, సన్నగా, అదొక

రకమైన సుకుమారత్వంలో ఒక కన్నెపిల్లలా వున్నాడు. అవన్నీ చూస్తుంటే తను చదువుకునే రోజుల్లో కాలేజీ నాటకాల్లో ఆడవేషం వేసే సుందర్ మాటిమాటికి జ్ఞాపకంవస్తున్నాడు. అతన్ని కాలేజీలో అంతా సుందరీ అని పిలిచేవారు. కొందరి మగాళ్ళల్లో ఎక్కువ ఆడతనం కనిపిస్తూ వుంటుంది. అలాటివాళ్ళను చూస్తుంటే నారాయణకి భలే ముచ్చటగా వుంటుంది. నున్నటి సిమెంటురోడ్డుమీద వేగంగా కదులుతున్న బస్సులోంచి దూరంగా దూరంగా జరిగిపోతున్న దీపాలతో గుంటూరు కనబడుతోంది. నారాయణ మనసు ఆనందంతో పురకలు వేస్తోంది మూడేళ్ళుగా తను వెళ్ళాలనుకునే తిరుపతికి ఈ నాడు వెళ్ళగలుగుతున్నాడు. ఈ ప్రయాణం కోసం ఎన్నాళ్ళగానో ఎదురుచూశాడు. ఆ స్వామికి ఈ నాటికి తనమీద దయకలిగింది. బస్సు ఒక్కవుదుటున ఆగడంతో నారాయణ ఆలోచనలు చెదిరి ఠక్కున ఆగిపోయాయి. తల బయటికి పెట్టి చూశాడు చిలకలూరిపేట బస్సుస్టాండు. మహా సందడిగావుంది. సోడాలవాళ్ళు, పళ్ళవాళ్ళు, బస్సు చుట్టూమూగారు. కండక్టరు మునుస్వామి కిటికీలోంచి తల బయటికి పెట్టి మల్లెపూలు బేరమాడటం మొదలుపెట్టాడు. ఒకళ్ళో యిద్దరో ప్రయాణీకులుఎక్కారు. వాళ్ళకు టిక్కెట్ కూడా యివ్వకుండా మునుస్వామి మల్లెపూలు బేరమాడి దోసిటినిండా మల్లెపూలుకొని జాగ్రత్తగా కాగితంలో పోసి పక్కన పెట్టుకున్నాడు.

“ఈ ముసల్ది మరీ జాస్తి ఖరీదుకి అమ్ముతుంది. ఈ పూవులు పావలాకి అమ్మింది. ఇలా సంపాదించిన డబ్బులన్నీ ఏం చేసుకుంటుందో అని పూలు ప్రియంగా అమ్మిన ముసలమ్మ మీద విసుక్కుని అక్కడెక్కిన ప్యాసింజర్లకి టిక్కెట్లు యిచ్చాడు.

కండక్టరు పూలెందుకు కొన్నాడా అని నారాయణకి అనుమానం వచ్చింది, డ్రైవరు కిందకుదిగి బీడీ ముట్టించుకుని వచ్చాడు.

“ఇయ్యాళ సర్వీసు మా డల్‌గా వుందే, ఏంటి మునుస్వామి, ఇక పోదామా - ఇంకెవరెక్కుతార్లే యిక్కడ” అని అన్నాడు.

“ఎక్కెక్కు తొందరగా పోనియ్యి, నాకివ్వాళ కావలి నైటవుట్” అన్నాడు మునుస్వామి.

“ఓహో అదా సంగతి, ఇవాళ మహా వుషారుగా వున్నావ్” అంటూ మునుస్వామి భుజంమీద గట్టిగా చరిచాడు.

మునుస్వామి ముసిముసి నవ్వులు నవ్వాడు. బస్సు బయలుదేరింది. జేబులోంచి దారం తీసి పేపర్లో పోసిన మల్లెపూలు వొళ్ళో పెట్టుకుని మెల్లగా ఒక్కొక్కటే మాల కట్టడం మొదలుపెట్టాడు మునుస్వామి.

డ్రైవరు మధ్యలో ఎందుకో వెనక్కి తిరిగి పూలు కడుతున్న మునుస్వామిని చూసి నవ్వి

"మొదలెట్టావూ ఏం శ్రద్ధరా నీకు" ఎందుకొచ్చిన యాతనా? అంతకు కావాలంటే కట్టినదండే కొనకపోయావా?" అన్నాడు. మనం సొంతంగా కట్టినపూలకు, కొన్న దండకు తేడా వుందిలేవయ్యా! ఇందులో వున్న ఆనందం నీకు తెలియదులె" అన్నాడు. మునుస్వామి అందంగా నవ్వుతూ.

"అవును నాకెలా తెలుస్తుంది."

కండక్టరు మునుస్వామి ప్రవర్తన నారాయణలో వింత ఆసక్తిని రేకెత్తించింది. ఆడవాళ్ళ కంటే ఎక్కువగా గీచి గీచి బేరమాడి పూలుకొనడం, ముందుగానే సిద్ధంగా వుంచుకున్న దారంతో ఆ పూలను ఎంతో జాగ్రత్తగా, సుతారంగా మాలకట్టడం - చూస్తుంటే నారాయణలో రకరకాల భావాలు బయలుదేరాయి. ఈ పూలదండను ఎవరికోసం ఇంత జాగ్రత్తగా కడుతున్నట్లు! పెళ్ళాం కోసమా ఈ రోజుల్లో కట్టుకున్న పెళ్ళాన్ని గుదిబండలా చూసే మగాళ్ళు వాళ్ళకి పూలదండలు, అందులో స్వంతంగా కట్టియిస్తారా? బహుశః ఏ ప్రియురాలో వుండి వుంటుంది. దాని కోసమే అయి వుంటుంది. ఇందాక కావలి నైటవుట్ అన్నాడుగా, ఇకనేం, అక్కడ ఈ ప్రబుద్ధుడికి ఏముందో వుండి తీరాలి. మోటారు వాళ్ళకి, పోలీసోళ్ళకి పొరుగూళ్ళలో ఇలా స్పేర్ పెట్టుకోవడం అలవాటేగా. దానికోసమే యింత శ్రద్ధగా

పూలమాల తయారుచేస్తున్నాడు. పూలుతీను కెళ్ళి దానికి స్తే అది కట్టుకోలేదూ ? అంత సుకుమారితనమా ? వీడి వాలకం చూ స్తే దానికి నూనెరాసి తలదువ్వి జడకూడా వేసేలాగ వున్నాడు. ఉత్త ఆడంగివెధవ! అసలు మనిషిని చూ స్తుంటే తెలియటం లేదూ.

మునుస్వామి దండ కట్టడం మధ్య మధ్యలో ఆపి కట్టిన దండని చూసి మురిసిపోతున్నాడు. అతని మురిపెం చూసే సరికి నారాయణకి వొళ్ళుమండుకొచ్చింది.

అబ్బ.... యెంత సంతోషంరా తండ్రీ ఆడంగి లాగ పూలు కట్టుకుందికి చాలక. యెంత వుబలాట పడిపోతున్నాడో కావలి వెళ్ళి ఆ ముండకు తలదువ్వి జడేసి పూలు పెడతాడు. దానితోనే సరసాలతో రాత్రంతా గడిపేస్తాడు. పాపం సొంత ఊళ్ళో యింటి దగ్గర వీడి భార్య ఒక్కర్తీ బిక్కు బిక్కు మంటూ ఏ చంటిపిల్లాడినో వొళ్ళో పడుకోబెట్టుకుని వుంటుంది. ఆ పిల్లవాడికి ఏ జ్వరమో వ స్తే వాడ్ని కరుచుకుని పడుకుని వుంటుంది. మధ్య మధ్యలో ఈ మగరాయుడు యెక్కడ తిన్నాడో, ఏం తిన్నాడో ఏ కారు సీట్లో పడుకున్నాడో అని బెంబేలు పడిపోతూ వుంటుంది. వీడేమో కావలిలో ప్రియురాలితో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, తను స్వయంగా కట్టిన మల్లెపూల దండను ఆమె జడలో పెట్టి మురిసిపోతూ వుంటాడు. అది వీడి జేబులు ఖాళీ చేస్తుంది. డబ్బు ఇలా జులాయి చేసి, ఇంటి దగ్గర పెళ్ళాం, పిల్లలు వస్తులతో బాధపడుతున్నా పట్టించుకోడు. అప్పులు -

వస్తులు - ఏమీ చేయలేక వూరికే వెళ్ళాన్ని తంతూ వుంటాడు. ఆమె ఏడుస్తూవుంటుంది భోరు భోరున ఏడుస్తూ వుంటుంది. కుమిలి కుమిలి ఏడుస్తుంది. పిల్లల్ని చూసుకుని చావలేక బ్రతుకుతున్నందుకు గుండెలవిసి పోయేలా ఏడుస్తుంది. అమ్మకూడా అలాగే కొన్నేళ్ళు ఏడ్చి ఏడ్చి బ్రతకలేక చచ్చిపోయింది. కనీసం తనకోసమైనా బ్రతకలేక ఆ బాధ భరించలేక వెళ్ళిపోయింది! అమ్మ అప్పుడెంత బాధపడింది తనే వెలుగుగా భావించి అమ్మ బ్రతకాలని పోయినవోపిక కూడతీసుకోబోయింది. కాని అమ్మ ఆరోగ్యం అప్పటికే చాలా దెబ్బతీసింది. తనకు తెలిసీ తెలియని వయసులో అమ్మ చనిపోయింది.

కళ్ళు మూసుకుని సీటుకు జారగిలపడి కూర్చున్న నారాయణ కళ్ళనిండా నీళ్ళూరాయి, కన్నీటి పొరల చాటునుండి ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రితం చనిపోయితల్లి ముఖం అస్పష్టంగా కదులుతోంది. నారాయణ కన్నీటిని బిగించిపెట్టి మునుస్వామి భార్యస్థానంలో తనతల్లిని వూహించుకున్నాడు. తన తండ్రి కూడా ఒక ముండని వుంచుకుని సర్వస్వం దానికి దోచిపెట్టి తన తల్లిని నానా హింసలూ పెట్టేవాడు, రోజూ ఏదో వంకతో అమ్మని కొడుతూనే వుండేవాడు. ఇప్పటికీ బామ్మ చెప్తుంది, కోడల్ని తలుచుకుని ఆమె కళ్ళనీళ్ళు పెట్టనిరోజంటూ వుండదు.

“అమ్మా ! అమ్మా” అని నారాయణ మనసులోనే అనుకున్నాడు.

"ఒంగోలు వచ్చింది లేవండిసార్" అని ఎవరినో తట్టిలేపుతున్నాడు కండక్టరు.

నారాయణ ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. మునుస్వామి యెదురుగా నవ్వుతూ కనపడ్డాడు.

"భోజనాలు చేసేవారు యిక్కడే చెయ్యండి సార్" అని చెప్పి చేతిలోని పూలదండను జాగ్రత్తగా కాగితం మీద గుండ్రంగా సున్నా ఆకారంలో అమర్చిపెట్టి క్రిందకి దిగాడు బస్సులో అంతా కిందకి దిగారు. ఒక ముసలాయన మాత్రం చివరిసీట్లో యింకా కునికిపాట్లు పడుతున్నాడు. నారాయణ ఆ దండను తీసి బాగా నలిపి అవతల పారేద్దామనుకున్నాడు. మళ్ళీ ఆలోచించాడు. పువ్వులేం చేశాయి. అనుకుని సరిపెట్టుకొన్నాడు మునుస్వామి కిళ్ళీ కొట్టువాడితో బిగ్గరగా నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నాడు అతని నవ్వు నారాయణలో మంటలు లేపింది. అతని మనసంతా మునుస్వామి మీద అసహ్యంతో నిండిపోయింది. తన తల్లి గుర్తుకు రావడంతో అతని మనసుచెదరి ముందటి ఉత్సాహమంతా పోయింది. మునుస్వామి మీద ఆపుకోలేనంత కోపంగా వుంది. ఏదో ఒక వంకపెట్టుకుని బస్సుదిగేలోపు యితన్ని బాగా తన్నాలి అనిపించింది నారాయణకి.

మునుస్వామి కొనడం పూర్తిచేసి మళ్ళీ బస్సెక్కాడు నారాయణ అతన్ని పురుగును చూసినట్లు చూశాడు వీడు తిండితినడా ? అయినా అది వీడికోసం ఏంచేసి వుంచుతుందో" అనుకున్నాడు చీదరగా.

మునుస్వామి సీటుమీద పెట్టివుంచిన పూలదండ తీసుకుని డ్రైవరు కేబిన్‌లోకి వెళ్ళాడు. కేబిన్‌లో వున్న వెంకటేశ్వరస్వామి పటానికి దండ అలంకరించాడు. కిళ్ళీకొట్లో కొనుక్కుని వచ్చిన పూదొత్తులు వెలిగించి ఫోటో ఫ్రేమ్‌లో గుచ్చాడు. రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు. కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని నిలబడ్డాడు. తరువాత మళ్ళీ కళ్ళు తెరిచి వచ్చి ఇదంతా కళ్ళప్పగించి చూస్తున్న నారాయణని చూసి నవ్వుతూ "ఏంటో సార్ నాకిదో అలవాటైపోయింది. సొంతంగా నా చేతులమీద దండ కట్టి స్వామికి వేస్తేగాని తృప్తివుండదు. అందుకే యిదో పిచ్చిగా చేస్తువుంటాను. ఏదో ఆనందం సార్ అలా చేస్తే ఈ సర్వీసుకొచ్చినప్పుడు ఇలా దండ వెయ్యకుండా నేను భోజనం కూడ చెయ్యను సార్" అని.

"ఏవిటి మీరింకా కూర్చున్నారే - భోజనం చెయ్యరా" అంటూ కిందకి దిగి వెళ్ళిపోయాడు భోజనం చెయ్యడానికి.

( ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక నుండి )